క్లుప్తంగా

న్యాయమూర్తులను నియమించాలి



నర్సంపేట రూరల్ : నర్సంపేట కోర్టులకు న్యాయమూర్తులను నియమించాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సృజయ పాల్, మౌసమీ భట్టాచార్యలను హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌజ్‌లో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యలను వివరించారు. కోర్టులో రెగ్యూలర్ ఆఫీసర్ లేకపోవడంతో కేసులు పరిష్కారం కాక కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మూడు కోర్టులకు రెగ్యూలర్ న్యాయమూర్తులను నియమించలేదని తెలిపారు. తొలుత న్యాయమూర్తులకు పూల బొకే అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సిలువేరు కిరణ్ కుమార్, మోటూరి రవి, అంబటి రాజ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ బండి శివ, దాస్యం రంగనాథ స్వామి, పందుగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలోనే అభివృద్ధి'



చెన్నారావుపేట : ప్రధాని మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా నాయకుడు, కంభంపాటి ప్రతాప్ (పుల్లారావు) తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నానాటికీ ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. సభ్యత్వ నమోదును మరింత విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వనపర్తి మల్లయ్య, దామెరుప్పుల రాజశేఖర్, మామిడాల రమేశ్, పృథ్వీ రాజ్, జగన్, రాములు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ కమిటీల ఎన్నిక

నర్సంపేట : ఎంఆర్‌పీఎస్ నర్సంపేట మండల, పట్టణ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఆగారపు హరీశ్, ప్రధాన కార్యదర్శిగా మిట్టగడపల హరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా జన్ను శ్రీకాంత్, ఆగారపు రాజీవ్‌గాంధీ, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కొలుకలూరి నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా మాస స్వామి, కార్యదర్శిగా మునిగె స్వామి ఎన్నికయ్యారు. ఎంఎస్ఎఫ్ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఇల్లొండ రాములు, ప్రధాన కార్యదర్శిగా సిద్దు, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, జగదీశ్వర్, నర్సంపేట మున్సిపల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా మాదాసి బాబు, ప్రధాన కార్యదర్శిగా గుండేటి వీరేశ్ ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇల్లందలో చోటు చేసుకుంది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. ఇల్లందకు చెందిన పాశబోయిన సంపత్ (30) ఈనెల 7న ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మహ్మద్ జావీద్ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. ఆయన కళాశాలకు వెళ్తుండగా మహబూబాబాద్ రోడ్డు వైపు నుంచి కంకరతో వస్తున్న టిప్పర్ అంబేద్కర్ సెంటర్‌లో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జావీద్‌కు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. జావీద్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని పానీష్‌తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త భూక్య రమేశ్ అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమేశ్, తదితరులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాషా, సంగులాల్, అండా, రవి, బోజ్యా, చంద్రు, మోహన్, బాద్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల పడిగాపులు

- ధాన్యం కొనుగోలు చేపట్టక వెతలు
- దళారులను ఆశ్రయిస్తున్న దుస్థితి



ధాన్యం ఆరబోస్తున్న మహిళా రైతు

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 10 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు దళారులను ఆశ్రయించి వచ్చిన ధరకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు మొదలెట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట జూనియర్ కళాశాల సమీపంలో, డీసీ తండా, కొత్తపల్లి, చంద్రు తండా, ఆర్‌డీ తండా, ఉప్పరపల్లి, కోనాపురం గ్రామాల్లో, ఐకేపీ ఆధ్వర్యంలో ఇల్లంద వ్యవసాయ మార్కెట్ ఆవరణలో, ల్యాబర్తి, బొక్కలగూడెం, రామవరం, దివిటిపల్లి, దమ్మన్నపేట, చెన్నారం, శ్రీరామోజీ కుమ్మరిగూడెంలో, మెప్మా ఆధ్వర్యంలో పిరంగిగడ్డ సెంటర్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత రబీలో పీఏసీఎస్ ద్వారా 60 వేల క్వింటాళ్లు సేకరించగా ప్రస్తుత ఖరీఫ్‌లో 80 వేల క్వింటాళ్ల కొనుగోలు అంచనా వేశారు. అలాగే ఐకేపీ ద్వారా రబీలో 76 వేల క్వింటాళ్లు సేకరించగా ప్రస్తుత ఖరీఫ్‌కు 90 వేల క్వింటాళ్ల సేకరణకు అంచనా రూపొందించారు. కాగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 10 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు మొదలెట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.



వర్ధన్నపేటలోని కొనుగోలు కేంద్రం

ఆరబోస్తూ.. రాశి చేస్తూ..



25 ఎకరాల్లో వరి సాగు చేశా. ఇప్పటివరకు 15 ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని వర్ధన్నపేట పిరంగిగడ్డ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. రోజూ ఉదయం ధాన్యం ఆరబోస్తూ, రాత్రికి తిరిగి రాశి చేస్తూ ఇబ్బంది పడుతున్నా. మరో పదెకరాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది. ధాన్యం కొనుగోలు మొదలవుతుందని రోజూ ఎదురు చూస్తున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియడం లేదు.

- బిక్కిని వెంకన్న, కౌలు రైతు, వర్ధన్నపేట

నీడ, నీరూ కరువే



నేను మూడెకరాల్లో వరి సాగు చేశా. పండిన ధాన్యాన్ని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నాలుగు రోజులు అవుతోంది. ఇంకా కొనుగోళ్లు చేపట్టడం లేదు. ధాన్యం తీసుకొచ్చే రైతుల కోసం కనీసం టెంట్లు ఏర్పాటు చేయలేదు. తాగునీటి సదుపాయం కల్పించలేదు. ఎండకు ఎండుతున్నాం. చలికి వణుకుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- జాటోతు మంజుల, డీసీ తండా

ప్రభుత్వం ఆదేశించగానే తూకాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ గ్రామాల నుంచి రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోస్తున్నారు. ప్రభుత్వం ఇంకా మిల్లులను కేటాయించలేదు. ఈ క్రమంలో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం త్వరలో మిల్లులు కేటాయించి ఆదేశాలు జారీ చేస్తుంది. అనంతరం వెంటనే కొనుగోళ్లు మొదలుపెడతాం.

- వెంకన్న, సీఈఓ, పీఏసీఎస్, వర్ధన్నపేట

త్వరలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతాం

- కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు



రైతులతో మాట్లాడుతున్న దేవేందర్‌రావు

వర్ధన్నపేట : త్వరలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు తెలిపారు. మండలంలోని దమ్మన్నపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్న ధాన్యానికి మద్దతు ధరలపై క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొనుగోళ్లు ఇంకా మొదలెట్టకపోవడంపై రైతులు ఆందోళనకు ఆందోళనకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్డుకు మరమ్మతు చేయాలి



ఖానాపురం : మండలంలోని బండమీదిమామిడి తండా నుంచి పంట పొలాలకు, పాకాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేయాలని రైతులు బోడ స్వామి, బోడ వెంకన్న, మోతీలాల్, దేవీలాల్, తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదరు రోడ్డు గుంతలమయమై బురదతో రైతులకు, ప్రయాణీకులకు ఇబ్బందికరంగా పరిణమించడంతో ఆయకట్టు రైతులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మీడియాతో మాట్లాడారు. సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామానికి దూరంగా పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన క్రమంలో లారీలు, ఇతర వాహనాలు వెళ్లడానికి వీలు లేని దుస్థితి నెలకొందని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు వాగ్య, రవి, కీమ, నవీన్, సురేశ్, సంపత్, రాము, బిచ్చ, వాగ్య, నీలమ్మ, మీర సర్వర్ మియా, ఆబోతు అశోక్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

ఖానాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి కోరారు. మండలంలోని ఐనపల్లి, మనుబోతులగడ్డ, బండమీదిమామిడితండా, అశోక్‌నగర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి సరైన ధర పొందాలని సూచించారు. కొనుగోళ్లు చేసిన తర్వాత వెంటనే రైతుల ఖాతాల్లో నిధుల జమ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో సొసైటీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది మేరుగు రాజు, కడ్దూరి వినయ్, డైరెక్టర్లు ఆబోతు అశోక్‌యాదవ్, వేములపల్లి సునీత, జాడి అచ్యుతం, అన్నంనేని రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



సంగెం : వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సురేశ్



రాయపర్తి : పశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి

సంగెం : పశువుల్లో వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని పశు వైద్యులు డాక్టర్ వారిపల్లి నరేశ్, డాక్టర్ రాజేశ్ కోరారు. మండలంలోని ఆశాలపల్లిలో రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని చీఫ్ మేనేజర్ సురేశ్ కాంబ్లే ప్రారంభించారు. ఈ సందర్భంగా 55 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స చేయడంతోపాటు 15 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. అనంతరం డాక్టర్ నరేశ్, డాక్టర్ రాజేశ్ మాట్లాడారు. పాడి పశువులు సకాలంలో ఎదకు రాకుంటే ముందస్తుగా గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయించాలని సూచించారు. ఎదకు వచ్చినపుడు పశువైద్యులను సంప్రదించి కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఉత్తమ జాతి దూడలు జన్మిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఇంద్రజీత్ సింగ్, ఏరియా ఇన్‌చార్జ్ పురుషోత్తం రాథియా, జిల్లా ఇన్‌చార్జ్ అభిజిత్ గాడి, పశు వైద్య సిబ్బంది పద్మ, శుకూర్, రమేశ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి, బురహాన్‌పల్లి గ్రామాల్లో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స అందించడంతోపాటు గాలికుంటు వ్యాధుల నివారణ టీకా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శృతి మాట్లాడారు. రైతులు పశువులను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు అనిల్, వెంకటయ్య, బానోతు రమేశ్, చెవ్వల రమేశ్, కపిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

పర్వతగిరి : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ ప్రాధాన్యత ఇస్తుందని హన్మకొండ ట్రి సిటీ క్లబ్ జిల్లా పీఆర్‌ఓ కటంగూరు రాంగోపాల్ రెడ్డి, జోనల్ చైర్మన్ గుండా వాసుదేవ్, అధ్యక్షుడు పెట్లోజు సురేశ్ బాబు తెలిపారు. ఆ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు శనివారం శానిటరీ ప్యాడ్స్, బీపీ అపారటస్, థర్మల్ స్క్రీనర్, వేయింగ్ మెషీన్‌లను వారు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, ఎంఆర్‌సీ ఉద్యోగి గారె జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన నర్సంపేట పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన తోట సాంబయ్య (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి సాయంత్రం టీవీఎస్ ఎక్సల్ వాహనంపై ఇంటికివెళ్తున్నాడు. పాకాల రోడ్డు కుమ్రంభీమ్ విగ్రహం సమీపంలో మలుపు తీసుకొని వెళ్తుండగా నర్సంపేట వైపు నుంచి పాకాల దిశగా ప్రయాణిస్తున్న అశోకా లైలాండ్ ట్రాలీ గూడ్స్ వాహనం టీవీఎస్ ఎక్సల్‌ను ఢీకొట్టింది. వెంటనే స్థానికులు సాంబయ్యను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

లింగ సమానత్వం సామాజిక బాధ్యత

గీసుకొండ : లింగ సమానత్వం పాటించడాన్ని సామాజిక బాధ్యతగా తహసీల్దార్ రియాజుద్దీన్ అభివర్ణించారు. మండలంలోని కోనాయమాకులలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'లింగ ఆధారిత హింస–మహిళా రక్షణ'పై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీలను తక్కువగా చూడడాన్ని అనాచారంగా, దురాచారంగా చెప్పారు. మహిళలను పురుషులతో సమానంగా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్వోదయ ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఇందిర, ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, అంగన్‌వాడీ టీచర్ రమాప్రభ, ఆశ కార్యకర్త రజిని, సీఏ రమ, పొదుపు సంఘం అధ్యక్షురాలు రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాల ఉన్నతిలో మహిళలు కీలకం

సంగెం : కుటుంబాలు ఉన్నతి సాధించాలంటే మహిళల భాగస్వామ్యం కీలకమని సర్వోదయ ట్రెయినింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఇందిర చెప్పారు. స్థానిక పద్మశాలి భవన్‌లో మహిళా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల్లో ఓపిక, చురుకుదనం ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, మండల మహిళ సహాయత కమిటీ అధ్యక్షుడు బిట్ల రామకృష్ణ, సభ్యులు విజయప్రకాశ్, రాజ్‌కుమార్, చంద్రకాంత్, గోపీ, శ్రవణ్, సంస్థ ప్రతినిధులు వనిత, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ప్రతిఘటించాలి



రాయపర్తి : కేంద్ర ప్రభుత్వం పెంచి పోషిస్తున్న మతోన్మాదాన్ని ప్రజలు ప్రతిఘటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కోరారు. విప్లవోద్యమ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మైలారంలో శనివారం ఆయన ఎర్రజెండా ఎగరేసి అమరులకు నివాళులర్పించారు. అనంతరం సూరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఫాసిజంతో దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ప్రజాస్వామిక హక్కులు ప్రమాదంలో పడుతాయని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి కులగణన, హైడ్రా, మూసీ ప్రక్షాళన, తదితరాలతో ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గబ్బెట దేవేందర్, వెంకన్న, యాదగిరి, రమేశ్, బాలు, ఎల్లయ్య, స్వామి, రాములు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : సర్వేను పరిశీలిస్తున్న సీపీఓ, సీఈఓ



దుగ్గొండి : శివాజీనగర్‌లో..



సమాచారం ఇచ్చి సహకరించండి

సాక్షి నెట్‌వర్క్ : సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి ప్రజలు సహకరించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గోవింద రాజన్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీత లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన, ఆర్‌డీఓ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, చైర్‌పర్సన్ అంగోతు అరుణ, ఇతర అధికారులు కోరారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, పర్వతగిరి, దుగ్గొండి, ఖానాపురం, వర్ధన్నపేట, గీసుకొండ, తదితర మండలాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వేను ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు అందించారు. ప్రజలు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు.



గీసుకొండ : సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ కల్పన

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



విఘ్నేశ్‌కు కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : స్థానిక నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నల్లబెల్లి మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు వల్లె పర్వతాలు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు బొట్ల ప్రతాప్, బీజేపీ దుగ్గొండి మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు పొగాకు విఘ్నేశ్ బీజేపీలో చేరగా వారికి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ప్రధాన కార్యదర్శులు బచ్చు వెంకటేశ్వర్‌రావు, తడుక వినయ్‌గౌడ్, చెల్పూరి రాజు, నాయకులు ఎరుకొండ కరుణాకర్, అశోక్, నూతనకంటి శ్రీను, తిమ్మాపురం శ్రీనివాస్, బొమ్మగాని రమేశ్, తిమ్మాపురం శ్రీనివాస్, నీలం రాజు పాల్గొన్నారు.

ఓటరు నమోదు, సవరణకు అవకాశం



నర్సంపేట : మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి



చెన్నారావుపేట : మాట్లాడుతున్న రశీద్

- స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

నర్సంపేట : కొత్తగా ఓటరు నమోదు, సవరణకు అవకాశం ఉందని స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన నమోదు నమోదు, సవరణ కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. తాజాగా 18 ఏళ్లు నిండిన, 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఓటరు నమోదులో ఏవైనా తప్పులుంటే సవరించుకోవచ్చని వివరించారు. పోలింగ్ బూత్‌ల్లో అధికారులు రెండ్రోజులపాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలో ఓటరు నమోదు, సవరణను ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఫణికుమార్ సందర్శించి మాట్లాడారు. ఓటరు నమోదు అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ సూపర్‌వైజర్లు మహ్మద్ రషీద్, భూక్య మమత, మహ్మద్ అష్మద్ ఖాన్, డ్యాగల రాజు , తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : మాట్లాడుతున్న తహసీల్దార్

ఖానాపురం : మండలంలోని రాగన్నపేటలో ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వామి, బీఎల్ఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా



చెక్కులు పంపిణీ చేస్తున్న రమేశ్, నాయకులు

చెన్నారావుపేట : అనారోగ్యంతో బాధపడే పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్ తెలిపారు. మండలంలోని లింగగిరి, అక్కల్‌చెడ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం రమేశ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. లింగాపురం గ్రామానికి చెందిన పోతు రాంబాబు, లావుడ్య లక్ష్మి, అజ్మీర లక్ష్మి, నరిగె శ్రీనివాస్, అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ఈర్ల వనిత, బాదావత్ తిరుపతి అనారోగ్యం బారిన పడి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగా వారికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, కుమారస్వామి, మాజీ సర్పంచ్ తూటి పావని, నాయకులు రమేశ్, బోనగిరి స్వామి, వెంకన్న, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.